క్లుప్తంగా

భోగలింగేశ్వరునికి లక్ష బిల్వార్చన



భోగలింగేశ్వరునికి నిర్వహించిన లక్ష బిల్వార్చన

కొయ్యలగూడెం: కార్తీకమాసం పురస్కరించుకొని అంకాలగూడెంలోని స్వయంభు శ్రీ ఉమా సమేత భోగలింగేశ్వర స్వామివారికి ఆదివారం లక్ష బిల్వార్చన పూజ నిర్వహించారు. అర్చకులు మామిళ్ళపల్లి సీతారాం ఆధ్వర్యంలో తెల్లవారుజామున విఘ్నేశ్వరుని పూజ అనంతరం స్వామి వారికి పంచామృతాభిషేకాలు, మారేడు దళాలతో లక్ష బిల్వార్చన పూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివయ్యను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఫ్రీజర్ బాక్సు మరమ్మతులకు విరాళం



ఫ్రీజర్ బాక్సు మరమ్మతుల నిమిత్తం మానవత సంస్థకు విరాళాన్ని అందిస్తున్న దాతలు

జంగారెడ్డిగూడెం: స్థానిక ఏరియా ఆసుపత్రిలో మానవత సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫ్రీజర్ బాక్సు మరమ్మతులకు అద్దంకి రఘునాథరావు, స్వర్ణకుమారి దంపతులు రూ.10 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో మానవత మండల అధ్యక్షుడు డీకే రెడ్డి, కార్యదర్శి గద్దే సత్యనారాయణ, మానవత మూర్తి, త్రిపుర సుందరి పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు దిశా నిర్దేశం



ప్రకాశం కళాశాలలో మాట్లాడుతున్న జయప్రకాష్

కొయ్యలగూడెం: ప్రభుత్వ హాస్టల్లో విద్య అభ్యసించే విద్యార్థులు పదో తరగతి పరీక్షలలో అత్యున్నత స్థాయిలో ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు రూపొందించినట్లు సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకులు సంక్షేమాధికారి వి.జయప్రకాష్ పేర్కొన్నారు. ఆదివారం కొయ్యలగూడెం ప్రకాశం డిగ్రీ కళాశాలలో జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి నాగరాణితో కలసి పదవ తరగతి హాస్టల్స్ విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఏఎస్‌డబ్ల్యూఓ జి.శంకరయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పరీక్షా సమయాలలో విద్యార్థులు ఆత్మస్థైర్యం నింపుకునే విధానం, అదేవిధంగా చదివిన అంశాలను గుర్తుపెట్టుకునే మెలకువలను వివరించారు. కొయ్యలగూడెం, బుట్టాయిగూడెం, జంగారెడ్డిగూడెం పరిధిలోని ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టల్స్ విద్యార్థులకు ఉన్న సందేహాలను అడిగి తెలుసుకొని వాటిని నివృత్తి చేశారు.

మానవ హక్కులపై అవగాహన పెంపొందించుకోవాలి

ఏలూరు (టూటౌన్): ప్రతి ఒక్కరూ మానవ హక్కులపై అవగాహన పెంపొందించుకోవాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డీబీఆర్‌సీ) జిల్లా కో–ఆర్డినేటర్ ఎస్ జ్యోతి కోరారు. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆదివారం డీబీఆర్‌సీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1948లో ఐక్యరాజ్య సమితి డిసెంబరు 10న మానవ హక్కుల దినోత్సవం ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. మానవత ఏలూరు యూనిట్ అధ్యక్షుడు మేతర అజయ్‌బాబు మాట్లాడుతూ మానవ హక్కులను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కరుణోదయ మానసిక విభిన్న ప్రతిభావంతుల పాఠశాల చైర్మన్ కె.డొమినిక్, డీబీఆర్‌సీ సిటీ కో–ఆర్డినేటర్ బలే సురేష్, మహిళా నాయకురాలు ఆర్‌పీ రమాదేవి, మౌనిక పాల్గొన్నారు.

భగవద్గీత కంఠస్థ పోటీలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తిరుమల, తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో భగవద్గీత మూడవ అధ్యాయంపై కంఠస్థ పోటీలు ఆదివారం స్థానిక రామచంద్రరావు పేటలోని శ్రీమత్ మార్కండేయ వేద పాఠశాలలో నిర్వహించారు. ఈ పోటీల్లో జూనియర్స్ విభాగంలో మొదటి మూడు బహుమతులను నగరానికి చెందిన సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు నందూరి సరయు ప్రథమ బహుమతి , బీ. యోగిత ద్వితీయ బహుమతి, ఎం. శ్రీ తులసి సహస్ర తృతీయ బహుమతి గెలుపొందారు. సీనియర్స్ విభాగంలో ఏ.హేమ నాగ దత్త (నారాయణ పాఠశాల) ప్రథమ బహుమతి, పీఆర్ ఆదర్శ కుమార్ (సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్) ద్వితీయ బహుమతి, ఏ. వేద సరస్వతి తృతీయ బహుమతి గెలుపొందారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఎంవీఎస్ సత్యనారాయణ, లలితా కామేశ్వరి, డీ. పుష్ప భాను వ్యవహరించారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రాం అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

మహిళలకు ఉన్నతి

- ఎస్సీ, ఎస్టీ మహిళలకు ప్రభుత్వం తోడ్పాటు
- ఆటో రిక్షాల కొనుగోలుతో ప్రోత్సాహం
- ఉన్నతి పథకం ద్వారా సున్నా వడ్డీకి రుణాలు
- సులభ వాయిదాల పద్ధతిలో చెల్లించుకునే అవకాశం





జీలుగుమిల్లిలో ఎస్టీ లబ్ధిదారిణి సత్యవతికి పంపిణీ చేసిన ఆటోను నడుపుతున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం మండలం చీమలవారిగూడెంకు చెందిన సత్యవతి ఉన్నతి పథకంలో ఆటో తీసుకున్న దృశ్యం

బుట్టాయగగూడెం: రాష్ట్రంలోని మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలనే సంకల్పంతో ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా ఉన్నతి పథకం కింద వడ్డీలేని రుణాలను అందిస్తున్నారు. దీనిలో ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఎలాంటి వడ్డీ భారం పడదు. ఉన్నతి పథకం ద్వారా రుణాలు పొందిన మహిళలు సొంత కాళ్లపై నిలబడి స్వశక్తితో అభివృద్ధి చెందాలనేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అభిలాష. దీనిలో భాగంగా జిల్లాలో ఎస్సీ, ఎస్టీకి చెందిన అర్హత గల మహిళలు 12 మందికి ఆటోలు పంపిణీ చేశారు. అలాగే బుట్టాయగూడెంలో ఎస్టీ, జీలుగుమిల్లి, కొయ్యలగూడెం మండలాల్లో ఎస్సీ మహిళలకు మూడు ఆటోలను పంపిణీ చేయడంతో ఆ మహిళల కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ మహిళలకు తోడ్పాటు

పలువురు మహిళలు కుటుంబాన్ని పోషించుకునేందుకు ఆటోడ్రైవర్‌గా మారి పనిచేస్తున్న రోజులివి. డ్రైవింగ్ లైసెన్స్‌లు ఉన్నప్పటికీ అనేక మంది మహిళలు వారి ఆర్థిక పరిస్థితులు బాగోలేక ఆటోలను అద్దెకు తీసుకుని నడుపుతూ ఆటో యజమానికి రోజుకు రూ.500 నుంచి రూ.600 చెల్లిస్తూ వస్తున్నారు. అలాగే మహిళలు నడుపుతున్న ఆటోలకు సాంకేతిక మరమ్మతులు తలెత్తితే వాటికి ఖర్చు కూడా వారే భరించాల్సి వచ్చేది. రోజంతా కష్టపడినా సాయంత్రానికి కనీసం కూలి కూడా పడని పరిస్థితిలో మహిళా ఆటో డ్రైవర్‌లు కొట్టుమిట్టాడుతున్నారు. ఈ పరిస్థితిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నతి మహిళా శక్తి పథకం ద్వారా మహిళలకు సొంతంగా ఆటోలు ఇవ్వాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా జిల్లాలో 12 మంది ఎంపిక చేశారు. వీరిలో ఏజెన్సీ ప్రాంతం నుండి ముగ్గురిని ఎంపిక చేసి ఆటోలు పంపిణీ చేశారు. లబ్ధిదారులకు సుమారు రూ.3 లక్షల వరకూ వడ్డీ లేని రుణాలను ఇవ్వడం జరుగుతుంది. ఒక్కో లబ్ధిదారుడు 10 శాతం వాటాను మూలధనం పెట్టుబడిగా చెల్లించాల్సి ఉంటుంది. అలాగే అతి తక్కువ మొత్తానికే నెలసరి వాయిదా చెల్లించే అవకాశం లబ్ధిదారునికి ప్రభుత్వం కల్పించింది.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం



మహిళల ఆర్థిక, సామాజిక అభ్యున్నతికి ప్రభుత్వం అన్ని విధాలా తోడ్పాటును అందిస్తుంది. పేదరికం నుంచి విముక్తి కోసం మహిళలకు అండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారు. తమ శక్తిని నిరూపించుకునేందుకు ప్రభుత్వం ఇస్తున్న ఆటోలను తీసుకున్న మహిళలు వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి చెందాలి.

– తెల్లం బాలరాజు, ఎమ్మెల్యే, పోలవరం

జగనన్న సహకారం మరువలేనిది



నేను కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. ఆటో నడిపే నైపుణ్యం ఉన్నప్పటికీ నా ఆర్థిక పరిస్థితుల వల్ల వాహనాన్ని కొనుక్కోలేకపోయాను. ఉన్నతి మహిళా శక్తి పథకంలో మాకు ఆటో ఇచ్చారు. చాలా సంతోషంగా ఉంది. జగనన్న ఇచ్చిన ఈ తోడ్పాటును మరువలేను. ఎన్నటికీ నేను నా కుటుంబం జగనన్నకు రుణపడి ఉంటాం.

పూనెం సత్యవతి, ఎస్టీ మహిళ, చీమలవారిగూడెం, బుట్టాయగూడెం మండలం

మహిళలు సద్వినియోగం చేసుకోవాలి



మహిళలు ఆదాయాన్ని పెంపొందించుకోవాలనే ఉద్దేశంతో ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం తోడ్పాటును అందిస్తుంది. దీనిలో భాగంగా వడ్డీలేని రుణాలు అందిస్తుంది. సులభ వాయిదాల పద్ధతిలో చెల్లింపునకు అవకాశాన్ని ఇచ్చింది. ఆటో రిక్షా కొనుగోలు చేసి వారు నిరంతరం ఆదాయం పొందేలా ఏర్పాటు చేసింది. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– సీహెచ్ సుబ్బారావు, వెలురు ఏరియా కోఆర్డినేటర్, జంగారెడ్డిగూడెం

నేడు దొరసానిపాడులో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ద్వారకాతిరుమల: మండలంలోని దొరసానిపాడులో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆశాఖ ఏఈఈ నరసింహ స్వామి ఆదివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. గుండుగొలనుకుంటలోని 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి, దొరసానిపాడు గ్రామం వరకు కొత్తగా 11 కేవీ ఫీడర్ వేస్తున్నట్టు చెప్పారు. ఈ క్రమంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తామన్నారు. కావున వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

వికసిత్ సంకల్ప యాత్ర

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని పట్టిన్నపాలెం, అక్కంపేట గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు కేంద్ర ప్రభుత్వ అమలు చేస్తున్న పీఎం ఉజ్వల యోజన, గ్యాస్ కలెక్షన్లు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన తదితర పథకాలను ప్రజలకు వివరించారు. జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఎంపీడీవో కె.విజయ్‌ప్రసాద్, సర్పంచ్ పారేపల్లి నాగేంద్ర, పసుపులేటి రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ



కొయ్యలగూడెంలో తెలుగు మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: ఆంధ్రమేవ జయతే రెండవ అంతర్జాతీయ తెలుగు మహాసభలు విజయవంతం చేయాలని డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు పిలుపుఇచ్చారు. కొయ్యలగూడెంలో నిర్వహించిన కాపు వనసమారాధనకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాజమహేంద్రవరంలో సభలను నిర్వహిస్తున్నట్లు పోలవరం నియోజకవర్గ తెలుగు మహాసభల కన్వీనర్ రొక్కాల నాగరాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాయకులతో కలిసి పోస్టర్లు ఆవిష్కరించారు. గోదావరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రాంగణంలో సమావేశాలు ఏర్పాటు చేసినట్లు నాగరాజు తెలిపారు. ఏఎంసీ మాజీ చైర్మన్లు జెట్టి గురునాధరావు, పారేపల్లి రామారావు, ముత్యాల తాతారావు తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో త్రయోదశి పూజలు



నందీశ్వరుడికి అభిషేకం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

కుక్కునూరు: కార్తీక త్రయోదశిని పురస్కరించుకొని కుక్కునూరు శ్రీ కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు ఆలయ అర్చకులు నవీన్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా నందీశ్వరుడికి పంచామృతాలతో అభిషేకం, సహస్ర నామార్చన పూజలు చేశారు. నందీశ్వర స్వామి విగ్రహాన్ని వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. అనంతరం శివలింగానికి పంచామృతాలతో అభిషేకం, ఆకాశదీపం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ పూజలలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటిలో సంతోషం

- చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా
- రత్నగిరిలో గడపగడపకు మన ప్రభుత్వం



ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు వివరించి బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

కామవరపుకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రంలోని ప్రతి ఇంటిలో ప్రజలు సంతోషంగా ఉన్నారని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం 209వ రోజు కార్యక్రమం శుక్రవారం మండలంలోని సాగిపాడు గ్రామపంచాయతీ పరిధిలోని రత్నగిరి గ్రామంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అమలు చేస్తున్న అభివృద్ధి పనులపై ఆయన గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అందిన లబ్ధిదారులకు ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీ పేరుతో అర్హులైన వారికి కూడా ప్రభుత్వ పథకాలు అందకుండా చేసిందని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేయలేదని, దీంతో ప్రజలు అల్లాడిపోయారన్నారు. 40 ఏళ్ల చంద్రబాబు రాజకీయ జీవితంలో, రాష్ట్ర ప్రజలకు చేసింది ఏమీ లేదని, మాయమాటలతో ప్రజలను మోసం చేశారన్నారు. నాలుగున్నర ఏళ్ల పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకు వచ్చి వలంటీర్ల ద్వారా ప్రతి గడపకు పథకాలు అందజేయడంతో రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధితో సుభిక్షంగా ఉందన్నారు. దీంతో రాష్ట్ర ప్రజలు జగన్ వైపే చూస్తున్నారని అన్నారు. టీడీపీ నాయకుల మోసపూరిత మాటలు నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ప్రతిపక్ష హోదాకు కూడా నోచుకోదని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గుండుగొలను సుబ్బారావు, ఉప సర్పంచ్ బలుసు వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మిడతా రమేష్‌బాబు, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ పండు జగదీష్, బొప్పన దుర్గయ్య, బేతిన రాఘవ, పులపాకుల ప్రసాద్, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

వైభవంగా సువర్చలా హనుమద్ కల్యాణం



సువర్చలా హనుమద్ కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయ స్వామి క్షేత్రంలో జరుగుతున్న కార్తీక మాస మహోత్సవాల్లో భాగంగా సువర్చలా హనుమద్ కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామివారి కల్యాణాన్ని ఘనంగా జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని వీక్షించి తరించారు. ధర్మ ప్రచారం కార్యక్రమంలో భాగంగా హేమాద్రి నాగజ్యోతి శేషబృందం, శ్రీరాజరాజేశ్వరి కూచిపూడి నృత్య కళాశాల వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఆలయ ఈవో ఆకుల కొండలరావు, ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురకంటి రంగారావు పాల్గొన్నారు.

పంట నష్టం అంచనా ప్రక్రియ ప్రారంభం



తూర్పు రేగులకుంటలో పంట నష్టాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ శాంతి, వ్యవసాయ శాఖ సహాయకులు

బుట్టాయగూడెం: మిచాంగ్ తుపాను కారణంగా ఏజెన్సీ ప్రాంతంలో వేలాది ఎకరాలు పంట నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకూడదనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అలాగే ఇటీవల నష్టపోయిన పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎం.సూర్యతేజ కూడా వ్యవసాయ, రెవెన్యూ అధికారులకు పంట నష్ట అంచనాలపై కచ్చితమైన ఆదేశాలు ఇచ్చారు. దీనితో వ్యవసాయాధికారులు పంటనష్ట అంచనాలను ప్రారంభించారు. నియోజకవర్గంలో 108 రైతు భరోసా కేంద్రాల పరిధిలో వ్యవసాయ అధికారులు, వ్యవసాయ సహాయకులు పంట అంచనా ప్రక్రియను చేపట్టారు. పంట దెబ్బతిన్న పొలాల వద్ద రైతుల వివరాలను అడిగి తెలుసుకుని ఆ వివరాలను నమోదు చేసుకుంటున్నారు. నియోజకవర్గంలో ప్రధానంగా వరి, మొక్కజొన్న, మినుము, నాటు పొగాకు, పొగాకు, వైట్ బార్లీ, మిరప, వేరుశనగ పంటలు భారీ వర్షాలకు దెబ్బతిన్నాయి. సుమారు వారం రోజుల వరకు అధికారులు పంట నష్టం అంచనాలను నమోదు చేశారు. రైతులు పంట నష్టం వేసే అధికారులకు సహకరించాలని ఉన్నతాధికారులు కోరుతున్నారు.

వర్జీనియా రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది



ఎమ్మెల్యే ఎలీజాకు వినతిపత్రం అందిస్తున్న వర్జీనియా రైతు సంఘం నాయకులు

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం.. రైతు ప్రభుత్వం అని, రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటుందని చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. వర్జీనియా రైతు సంఘాల నాయకులు ఆదివారం ఎమ్మెల్యే ఎలీజాను కలిసి తుపాను కారణంగా నష్టపోయిన వర్జీనియా రైతులను ఆదుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే రూ. 2 లక్షల వరకు పెట్టుబడులు పెట్టి ఉన్నామని, తుపాను దెబ్బకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. పొలాల్లో ఇసుక మేటలు వేశాయని, తోట తుడిచిపెట్టుకుపోగా, ఎదిగిన తోట నేలవాలిందన్నారు. పొలాలను పంటకు సిద్ధం చేయాలన్నా, నేలవాలిన తోటలను ఒబ్బిడి చేసుకోవాలన్నా చాలా ఖర్చులు అవుతాయని, బ్యాంకుల ద్వారా అదనపు రుణం, సబ్సిడీపై ఎరువులు ఇప్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ ఇప్పటికే అధికారులతో కలిసి దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించినట్లు చెప్పారు. అధికారులు నష్ట అంచనాలు తయారు చేస్తున్నారని, నివేదికలు అందగానే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో సత్రం వెంకటరావు, వామిశెట్టి హరిబాబు, వీవీఎస్ ప్రకాశరావు, అట్లూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషను పరిరక్షించుకోవాలి

గణపవరం: మన సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించే సాహిత్యాన్ని పరిరక్షించుకోవలసిన బాధ్యత మనందరిపైన ఉందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్, మాజీ మంత్రి ఇందుకూరి రామకృష్ణంరాజు అన్నారు. ఆదివారం గణపవరం మండలం పిప్పర శాఖా గ్రంథాలయానికి ఆయన తెలుగు, ఆంగ్లభాషకు సంబంధించిన సాహిత్య పుస్తకాలను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకుని విజ్ఞాన వంతులు కావాలని కోరారు. గ్రంథాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళా శక్తి పథకం ద్వారా చేయూత



రాజవరంలో ఆటోను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

కొయ్యలగూడెం: మహిళా సాధికారికాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి రాష్ట్రవ్యాప్తంగా ప్రజాప్రతినిధులలో స్ఫూర్తిని నింపింది అని జిల్లా విద్యా వైద్య స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం రాజవరం గ్రామంలో మహిళా శక్తి పథకం ద్వారా మంజూరైన ఆటోను ప్రజాప్రతినిధులతో కలిసి ఆమె ప్రారంభించారు. రాజవరం గ్రామానికి చెందిన లబ్ధిదారురాలు భీమడోలు మంగకు వడ్డీ లేని రుణంతో సుమారు రూ.3.35 లక్షల విలువైన ఆటోను ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసి అప్పగించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచ్‌ల చాంబర్ ఉపాధ్యక్షుడు స్థానిక సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్య, ఉప సర్పంచ్ అనంతల సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరంగనీలయం కాశీ విశ్వనాథం, తమ్మిర్సి బ్రహ్మయ్య, యడ్లపల్లి వెంకటేశ్వరరావు, భీమడోలు దుర్గారావు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు అవగాహన ర్యాలీ



మర్రిగూడెంలో ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్డీవో తదితరులు

టి.నరసాపురం: ఓటే మన ఆయుధం, ఓటే మన భవిష్యత్తు అని పోలవరం నియోజకవర్గ ఈఆర్‌వో, జంగారెడ్డిగూడెం ఆర్డీవో కె.అద్దయ్య అన్నారు. మండలంలోని మర్రిగూడెంలో ఆదివారం ఓటరు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో మానవహారం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు పాత్ర కీలకమని, ప్రజాస్వామ్యానికి రక్షణ కవచం అని అన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలన్నారు. ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థినులతో కలిసి భోజనం చేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంట తహసీల్దార్ జేవీ సుబ్బారావు, ఎంపీపీ దారబోయిన లక్ష్మీ వెంకటేశ్వరరావు, సర్పంచ్ సోయం బిందు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



బుట్టాయగూడెంలో పూర్వ విద్యార్థులు కలుసుకున్న దృశ్యం

బుట్టాయగూడెం: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుకున్న 1980వ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని బుట్టాయగూడెంలో ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి మధుర స్మృతులు, విద్యార్థి దశలో చేసిన అల్లరి, గురువులను ఆటపట్టించిన తీరును పూర్వ విద్యార్థులు నెమరవేసుకుంటూ ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చిలుకూరి లక్ష్మీనారాయణ, గుండుబేని నరసింహారావు, తెల్లం సత్యనారాయణ, భోగవల్లి వెంకటేశ్వరరావు, వేణు, బంగారుపాప, స్వరాజ్యలక్ష్మి, సుభాషిని, కరాటం టిమోజన్, ఉడతా సత్యనారాయణ, మద్దపాటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'లో భాగస్వాములు కావాలి



ధర్మాజీగూడెంలో క్రీడా పరికరాలు అందజేస్తున్న దృశ్యం

లింగపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వైస్ ఎంపీపీ మట్టా సురేష్ అన్నారు. ఆదివారం ధర్మాజీగూడెంలో ఆర్‌సీఎం చర్చి, ఎంఎన్ఆర్ కాలేజీ ఏరియాల్లో క్రీడాకారులకు వైస్ ఎంపీపీ మట్టా సురేష్, సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి వరప్రసాద్ చేతుల మీదగా ప్రభుత్వం అందజేసిన క్రీడా పరికరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను వెలికితీసేందుకు ప్రభుత్వం ఈనెల 15 నుంచి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. 15 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ పోటీల్లో పాల్గొనవచ్చుని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌సీఎం చర్చి ఫాదర్ జి ఆనండ్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు మండలపు రాఘవరావు, గారపాటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.